# మల్లెకాంత

మల్లెపూలు ఈమధ్య వర్గభ్రష్టత్వం చెందినై. వీటి దుర్దశచూసి విచారించేవాళ్ళలో, జాలిపడేవాళ్ళలో ఎలాగైనా వాటిస్థానం వాటికి తిరిగి లభింపజేద్దాం అనేవాళ్ళలో నే నొకణ్ణిగాను.

ఈరోజుల మల్లెపూలు వర్గభ్రష్టత్వం చెందడంలో ఆశ్చర్యంలేదు. ఇది ఏనాడో జరగవలసింది. ఇప్పటివరకూ మన శత్రువును మనం కొనసాగించడం మన పొరపాటే!—

ఇప్పటికూడా ఆడవాళ్ళ తలలపైన అర్ధచంద్రాకారంగా అమిర్చి పెడితే అతి అందంగా కనిపించేవి మల్లెపూలే. సాయంకాలమప్పుడు యువతులు తెల్లటి, పల్చటి చీరలు కట్టుకుని తల్లో మల్లెపూలు ధరించి వీధినిపడి నడుస్తూంటే చూసి తియ్యటి కలలు కనని మొగవాడు కనిపించడం అరుదు. ఈ ఆకర్షణ ఆడవాళ్లలో వుందా, వాళ్లు తల్లో పెట్టుకున్న మల్లెపూలలో వుందా అంటే, నేను చెబితే మీరు నమ్మరు. అయినా, మల్లెపూలు పెట్టుకోని ఇల్లాలినీ, మల్లెపూలు పెట్టుకున్న ఇల్లాల్నీ ఇద్దర్నీ ఒకసారి ఒకరిప్రక్కగా మరొకర్ని నిలబెట్టి చూసుకోండి. ఇద్దరికీవుండే భేదం మీకే తెలుస్తుంది.

మల్లెపూలు ఆడవారి అభిమానాన్ని పొందడానికి అనేక కారణాలున్నాయి. స్వచ్ఛందమైన శ్వేతవర్ణం కలిగివుండడం ఒకటి, శ్వేతవర్ణపుపూలు ఇంకా అనేకం వున్నప్పటికీ ధరించడానికి అనువుగానూ, పోర్టబుల్ సైజులోనూ ఉండడం రెండో కారణం. మూడో కారణం అతి ముఖ్యమైనది-ధరించిన కాస్సేపటికి మొగ్గ విడిపువ్వుగా వికసించే సమయంనుంచి ఒకటి రెండు గంటలవరకు అవి నలుమూలలకు విరజిమ్మే అమూల్యమైన సువాసనలు. ఈ సువాసనలతో పొందిన కౌగిలికోసం ఆశించని మొగవాడు వొట్టి వ్రేపి!

ఇన్ని ఆకర్షణలు కలిగివున్న మల్లెకాంతను నారీజనం తమ తలలపైన ఎక్కించుకొన్నారంటే ఆశ్చర్యమేముందీ? ఇది వారి సౌందర్య

తృష్ణనూ, మృదుస్వభావాన్నీ, పైమెరుగులంటే వారికి గల ప్రీతినీ సూచిస్తుందేగాని, లోతుకుపోయి చూసే స్వభావాన్నీ, విమర్శనాశక్తినీ సూచించదు.

పూర్వం మల్లెపూలు వేసంకాలంలో మాత్రమే పుష్పించేవి. ఆకాలంలో పూసినపూలు ఎంతో సువాసన కలిగివుండి, త్వరగా వాడిలి పోకుండా, ఆ సువాసన ఎంతో సేపు వుండేది. కాగా, వాటికి శయనాగారాల్లో ఎంతో ప్రాముఖ్యం, 'డిమేండు' కలిగింది, వాటి సౌందర్యం, సౌరభం మొగవాళ్ళ దృష్టినిగూడా ఆకర్షించి అనేకమంది-హరిదాసులు మొదలైనవారు వాటిని మాలలక్రింద తయారుచేసి ధరించేట్టు చేసింది.

కాని, నేడు మల్లెకాంత బజారు స్త్రీగా మారిపోయి, తన ఔన్నత్యాన్నుంచి జారిపడి అధఃపతనమైంది. ఇప్పుడు మల్లె ఏకాలంలోపడితే ఆకాలంలో ఎక్కడ పడితే అక్కడ విరగబూస్తూంది. కాని, దానిలోంచి మునపటి మత్తు కలిగించే పరిమళం అంతర్ధానమయింది. ఇంతే కాకుండా మల్లెకాంతకు మునపటి ఓపికగూడా తగ్గి ధరించిన కాస్సేపటికే తలవేడికి మాడిపోయి దుర్వాసనకొడుతూ, తన అల్పత్వాన్నీ, నీచత్వాన్ని ధరించిన వారికిగూడా ఆపాదిస్తూంది.

కాగా, సభ్యతాభావం గల ప్రతిస్త్రీ నేడు మల్లిని బహిష్కరిస్తూంది. వివేకం గల ప్రతిస్త్రీ తన తలలోనుంచి మల్లెను తరిమివేస్తూంది. శయనాగారంలో జేరిన కాస్సేపటికే తన తలలో ఒడిలిపోయిన మల్లెయొక్క మాడుకంపుతో భర్తకు అసహ్యం కలిగించడానికి ఏ స్త్రీ యిష్టపడుతుందీ ?